


# విభారె


## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 12-09-2023 | సంపుటి : 05 | సంచిక : 15 | పేజీలు : 8 | వెల : రూ 3-00

## హౌస్ రిమాండ్ పిటిషన్‌పై తీర్పు వాయిదా



విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన తెదేపా అధినేత చంద్రబాబు జైలు రిమాండ్‌ను పిటిషన్‌పై తీర్పు మంగళవారానికి వాయిదా పడింది. చంద్రబాబు తరఫున సుప్రీం కోర్టు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో ఇవాళ సుదీర్ఘంగా వాదనలు సాగాయి.సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. చంద్రబాబుకు ఇంట్లో కన్నా జైల్లోనే సెక్యూరిటీ ఉంటుందని కోర్టుకు వివరించారు.చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉందని, జైల్లో పూర్తి స్థాయి భద్రత కల్పించామని అదనపు ఏజీ న్యాయస్థానానికి తెలిపారు. జైల్లోనే కాకుండా పరిసర ప్రాంతాల్లోనూ పోలీసు భద్రత ఉన్నట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 24 గంటలూ పోలీసులు విధుల్లోనే ఉంటున్నారని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వైద్య సదుపాయం కూడా ఏర్పాటు చేశామని అన్నారు. రాజమహేంద్ర కేంద్రకారాగారంలో 50 అడుగుల ఎత్తైన గోడలు ఉన్నాయని అదనపు ఏజీ కోర్టుకు తెలిపారు. ఆర్థిక నేరాల్లో సాక్ష్యాలను ప్రభావం చేసే అవకాశం ఉండటం వల్ల.. చంద్రబాబును హౌస్ రిమాండ్‌కు అనుమతించవద్దని న్యాయస్థానాన్ని కోరారు.చంద్రబాబు తరఫున సుప్రీం కోర్టు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ఆయనకు జైలులో ప్రమాదం పొంచి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కరుడుగట్టిన నేరస్థులు, ఆయుధాలు వాడిన నేరస్థులు అదే జైల్లో ఉన్నారని, చంద్రబాబుకు ముప్పు ఉన్న నేపథ్యంలోనే ఎన్‌ఎస్‌జీ భద్రత కల్పించారని లూథ్రా కోర్టుకు తెలిపారు. కేంద్రం కల్పించిన సెక్యూరిటీకి సంబంధించిన అంశంపై ఏపీ ప్రభుత్వం జోక్యం చేసుకునేందుకు అవకాశం లేదని కోర్టుకు విన్నవించారు. హౌస్ రిమాండ్‌కి సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును లూథ్రా వివరించారు. ఇందుకు గౌతం నవలాఖ కేసును ఉదహరించారు.

# 13, 14 తేదీల్లో మోడీతో జగన్ భేటీ



విజయవాడ, సెప్టెంబర్ 11ఏపీ సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఈనెల 13, 14 తేదీల్లో ఢిల్లీ వెళ్లనున్న జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రధాని మోడీతోపాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశం అవుతారని సమాచారం. చంద్రబాబు అరెస్ట్, జమిలీ ఎన్నికల కసరత్తు వేళ... సీఎం జగన్ ఢిల్లీ పర్యటన ఆసక్తి రేపుతోంది.ఏపీలో ఇప్పటికే రాజకీయం వేడెక్కింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేసి... రిమాండ్‌కు కూడా పంపారు. చంద్రబాబు అరెస్ట్ అక్రమమని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. గవర్నర్ అనుమతి కూడా తీసుకోలేదని మండపడుతున్నారు. మరోవైపు... చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ ఎంపీలు ఇప్పటికే రాష్ట్రపతికి, ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు పట్ల నియంతలా వ్యవహరించిందని.. పోలీసులు, సీఐడీ అధికారులు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని లేఖలో పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే చంద్రబాబుపై కేసులు పెట్టి వేధిస్తున్నారని లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు టీడీపీ ఎంపీలు.మరోవైపు.. ఈనెల 18 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు ప్రవేశపెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు, యూసీసీ, మహిళా బిల్లులను ఆమోదం పొందేలా కేంద్రం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ఔఆం పక్షాలతో పాటుగా తటస్థంగా ఉన్న పార్టీల మద్దతు కోరుకుంటోంది. పార్లమెంట్‌లో వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభలోని 543 స్థానాల్లో 67 శాతం మద్దతు దక్కాలి. దీంతో పాటుగా రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం దీనిని సమర్థించాలి. దీంతో పాటుగా దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు దీనికి ఆమోదముద్ర వేయాలి. లోక్‌సభలో బీజేపీకి 333 సీట్ల ఉన్నందున 61 శాతం మద్దతు ఉన్నట్టే. కానీ.. బిల్లు ఆమోదానికి మరో 5 శాతం ఓటింగ్ అవసరం. లోక్‌సభలో వైసీపీకి 22 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభలో చూసుకున్నా... 38 శాతం ఎన్డీఏ కూటమికి మద్దతు ఉంది. అక్కడా వైసీపీ మద్దతు అవసరం. రాజ్యసభలో వైసీపీకి ఉన్న తొమ్మిది మంది సభ్యులు బిల్లుల ఆమోదానికి కీలకంగా మారారు. ఇక, బీజేపీ పది రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఈ బిల్లులు ఆమోదం పొందాలంటే 14 రాష్ట్రాలు ఆమోదించాల్సి ఉంది. ఆ సమయంలోనూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం కీలకం కానుంది. పార్లమెంట్‌లో ఇప్పటివరకు ఎన్డీయే సర్కార్ తీసుకొచ్చిన బిల్లులకు వైఆర్‌ఎస్‌సీపీ మద్దతు ఇచ్చింది. వర్షాకాల సమావేశాల్లో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు కూడా వైసీపీ అండగా నిలిచింది. అయితే.. ప్రత్యేక సమావేశాల్లో బీజేపీ సర్కార్ ప్రవేశపెట్టబోతున్న కీలక బిల్లులకు మద్దతు పార్టీ వైఖరి ఏంటి అన్నది ఆసక్తికరంగా మారింది. అటు.. చంద్రబాబు అరెస్ట్... ఇటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎన్డీయే సర్కార్ ప్రవేశపెట్టనున్న బిల్లుల మద్దతు... ఈ క్రమంలో సీఎం జగన్ ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## 144 సెక్షన్ కేవలం ప్రతిపక్షాలకే వర్తిస్తుందా?: నాదెండ్ల మనోహర్



మంగళగిరి: ఏపీలో పోలీసులు వైకాపాకు కొమ్ముకాస్తూ.. తొత్తుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుపై చేపట్టిన బంద్ విషయంలో పోలీసులు 144 సెక్షన్ పెట్టారని... కానీ, వైకాపా నేతలు మాత్రం ఇష్టం వచ్చినట్లు రోడ్లపై తిరిగారని ఆరోపించారు. గుంటూరులో మేయర్ కావటి మనోహర్ నాయుడు పోలీసు లాఠీతో జనసేన కార్యకర్తల్ని బెదిరించటాన్ని తప్పుబట్టారు. 144 సెక్షన్ కేవలం ప్రతిపక్షాలకే వర్తిస్తుందా అని ప్రశ్నించారు. చంద్రబాబుని కుట్రపూరితంగా అరెస్టు చేసింది నిజమేనని.. అందుకే రాష్ట్రంలో ప్రజలు ఇవాళ స్వచ్ఛందంగా బంద్ పాటించారని అభిప్రాయపడ్డారు. రాబోయే ఎన్నికల్లో జగన్ రెడ్డి ఇంటికి పోవటం ఖాయమని నాదెండ్ల దుయ్యబట్టారు.

## ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ 3 వారాలకు వాయిదా

న్యూఢిల్లీ: కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. పిటిషనర్ సునీతారెడ్డి తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ఏపీలో చంద్రబాబు కేసుతో బిజీగా ఉండటంతో అందుబాటులో లేకుండా పోయారు.ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపిన సునీతారెడ్డి.. కేసు విచారణ వాయిదా వేయాలని కోరారు.పిటిషనర్ సునీత విజ్ఞప్తి మేరకు మూడు వారాలకు వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. కాగా వైఎస్ వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సునీతారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా అవినాష్ రెడ్డి బెయిల్ రద్దుపై విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.



# చంద్రబాబు అంటేనే ఓ బ్రాండ్.. ఆ ఆరోపణలను ఎవరూ నమ్మడం లేదు: లోకేశ్



రాజమహేంద్రవరం: ప్రజా సంక్షేమమే తప్ప అవినీతి చేయడం తమ కుటుంబ రక్తంలోనే లేదని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లోనే అరుదైన గుర్తింపు పొందిన వ్యక్తి చంద్రబాబు అని చెప్పారు.స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టయిన నేపథ్యంలో రాజమహేంద్రవరంలో మీడియాతో లోకేశ్ మాట్లాడారు. "ప్రజలు, రాష్ట్రం, దేశం తప్ప వేరేమీ ఆలోచించని వ్యక్తి చంద్రబాబు. ఆయన ఎప్పుడూ ఉద్యోగాలు, పరిశ్రమలు, అభివృద్ధి గురించే ఆలోచిస్తారు. చంద్రబాబు అంటేనే ఓ బ్రాండ్ అని బిల్‌గేట్స్, క్లింటన్, ఫార్చ్యూన్ 500 సీఈవోలూ చెబుతారు. అలాంటి వ్యక్తిపై దొంగకేసు పెట్టి సైకో జగన్ ప్రభుత్వం జైలుకు పంపింది" అని దుయ్యబట్టారు."పాముకు తలలోనే విషం ఉంటుంది.కానీ, జగన్‌కు ఒళ్లంతా విషమే. చంద్రబాబుకు అవినీతి మరక అంటించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు అరెస్టుతో ప్రజల్లో ఎప్పుడూ లేనంత స్పందన వచ్చింది. తెదేపా బంద్‌కు ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు తెలిపారు. బంద్‌ను జయప్రదం చేసిన అందరికీ కృతజ్ఞతలు. బంద్‌లో పాల్గొన్న జనసేన, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. చంద్రబాబు జోలికి రావడం సైకో జగన్ చేసిన అతిపెద్ద తప్పు. జగన్ రాజకీయంగా, వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించబోతున్నారు." అని లోకేశ్ హెచ్చరించారు.జగన్‌కు అధికారం అంటే ఏంటో తెలియదని, ఆయనకు అధికారమంటే కక్ష సాధింపులు, వేధింపులు, దొంగ కేసులు, హింస మాత్రమేనని లోకేశ్ విమర్శించారు." చంద్రబాబుపై చేసిన అవినీతి ఆరోపణలను ఎవరూ నమ్మడం లేదు. చంద్రబాబు అరెస్టును బంగాల్ సీఎం మమతా బెనర్జీ, జోహో సంస్థ ఛైర్మన్ ఖండించారు. పింక్ డైమండ్, వివేకా హత్య, కోడికత్తి కేసుల్లో ఎంత అబద్ధం ఉందో ఈ కేసులోనూ అంతే అబద్ధం ఉంది. చంద్రబాబు, ఆయనకు చెందిన వారి ఖాతాల్లోకి డబ్బు వెళ్లిందని నిరూపించలేకపోయారు." అని అన్నారు." జగన్‌ను సూటిగా ప్రశ్నిస్తున్నా.. అసలు నీ చరిత్ర ఏంటి? జగన్.. నీపై ఎన్ని కేసులున్నాయి? వాటి వివరాలు మాలాగా పబ్లిక్‌గా చెప్పగలవా? జగన్‌పై 38 కేసులు, 10 సీబీఐ, 7ఈడీ కేసులు, 21 ఇతర కేసులున్నాయి. జగన్‌పై కేసులు పదేళ్లుగా ట్రయల్‌కు కూడా రావడం లేదు. జగన్ ఎంతగా వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారో దీన్ని బట్టే అర్థం అవుతోంది. బాబాయి హత్య కేసు ముద్దాయిలను సైకో జగన్ కాపాడుతున్నారు. సీబీఐకి పోలీసులను అడ్డుపెట్టి అవినాశ్ అరెస్టు కాకుండా జగన్ కాపాడారు" అని లోకేశ్ ధ్వజమెత్తారు.ఈ ప్రభుత్వంపై తన పోరాటం ఆగదని లోకేశ్ పునరుద్ఘాటించారు. '' నేను రాజమహేంద్రవరంలోనే ఉన్నా.. ఎక్కడికీ పారిపోలేదు. నన్ను అరెస్టు చేయాలనుకుంటే వచ్చి చేసుకోండి. ఎన్ని రోజులు జైలులో పెట్టుకుంటారో పెట్టుకోండి. ఈ ప్రభుత్వం అంతు తేల్చే వరకు నా పోరాటం కొనసాగుతుంది. న్యాయాన్ని నిలబెట్టే ప్రక్రియలో ఎన్ని కుట్రలనైనా ఎదుర్కొంటాం. మేం ప్రకటించిన ఆస్తులకంటే అదనంగా ఉంటే చూపించండి.. ఇచ్చేస్తాం." అని లోకేశ్ అన్నారు. తెదేపాకి సంక్షోభాలు కొత్త కాదని, అప్పట్లో ఇందిరాగాంధీ, ఆ తర్వాత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కూడా సమర్థంగా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. అలాంటిది.. సీఎం జగన్ పెద్ద లెక్కేం కాదని అన్నారు.ఈ కేసులో ప్రభుత్వం ఒక్క ఛార్జ్‌షీటు కూడా దాఖలు చేయలేకపోయిందని లోకేశ్ అన్నారు. '' తప్పు జరగలేదు కాబట్టే ఛార్జ్ షీటు వేయలేకపోయారు. మనీలాండరింగ్ జరగలేదని ఈడీ రిపోర్టులో కూడా చెప్పారు. జగన్ ప్రభుత్వం.. అనేకమంది తెదేపా నేతలపై దొంగ కేసులు పెట్టింది. నాపై హత్యాయత్నం సహా 20 కేసులు పెట్టారు. రూ.42 వేల కోట్లు మింగిన జగన్ ఇవాళ బయట తిరుగుతున్నారు. బాబాయిని చంపిన అవినాష్ రెడ్డి బయట తిరుగుతున్నారు. ఏ తప్పూ చేయని మాపై తప్పుడు కేసులు పెడితే ఊరుకుంటామా? సైకో జగన్‌ను వదిలిపెట్టను.. ప్రజల్లోకి వెళ్లి పోరాడతా." అని లోకేశ్ అన్నారు.చంద్రబాబు అరెస్టు దృష్ట్యా యువగళానికి తాత్కాలిక విరామం ఇచ్చినట్లు లోకేశ్ పేర్కొన్నారు. అన్నీ సర్దుకున్నాక మళ్లీ యువగళం పాదయాత్ర ప్రారంభమవుతుం దన్నారు. '' మేం ఒంటరివాళ్లం కాదు.. మాది ప్రజాబలం. ప్రజల కోసం చేసే పోరాటంలో చంద్రబాబు అరెస్టు స్పీడ్ బ్రేకర్ మాత్రమే. స్పీడ్ బ్రేకర్లను తొక్కుకుంటూ ఎలా వెళ్లాలో తెలిసిన పార్టీ మాది." అని లోకేశ్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు హౌస్ రిమాండ్‌కు అనుమతివ్వాలని కోరారు. పార్లమెంటరీ స్థాయిలో మంగళవారం పార్టీ నేతలు సమావేశమై పూర్తి స్థాయి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

# ఏపీ వ్యాప్తంగా టీడీపీ నిరసనలు

విజయవాడ, సెప్టెంబర్ 11 స్కిల్ డెవలప్మెంట్ కేసులో రిమాండ్‌కు వెళ్ళిన టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకు సంఘీభావం తెలుపుతూ టిడిపి బంద్‌కు పిలుపు నిచ్చింది. ఆందోళనలు నిలువరించేందుకు రాష్ట్రంవ్యాప్తంగా ప్రభుత్వం 144 సెక్షన్‌ను అమల్లోకి తెచ్చింది. ఉదయం నుంచి చాలా ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తుగా టిడిపి నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేయగా, మరికొందరు నిరసన వ్యక్తం చేసేందుకు రోడ్డుపైకి వచ్చారు. వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్స్ కు తరలించారు.. మూడు రోజులుగా హౌస్ అరెస్ట్ చేసన్తా తన ఇంటి చుట్టూ బ్యారికేడ్లు పెడుతూ ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఈరోజు తన ఇంటికి వచ్చిన పోలీసులతో ఆయన గొడవ పడ్డారు. హౌస్ అరెస్టు నోటీస్‌ను తిరస్కరించారు. మూడు రోజులుగా మాగుంట లేఔట్‌లో బారికేడ్లతో రాకపోకలను నిలిపివేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫైర్ అయ్యారు కోటంరెడ్డి. తనను అరెస్ట్ చేయాలని, తానే స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌కి వస్తానని, తనను లాకప్‌లో పెట్టాలని అన్నారు. కనీసం పని వారిని కూడా తన ఇంట్లోకి రానివ్వడంలేదని, ఇదెక్కడి అన్యాయమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పరిటాల సునీతను తెల్లవారుజామున నాలుగు గంటలకే హౌస్ అరెస్ట్ చేశారు పోలీసులు. వెంకటరాపురంలో పరిటాల సునీత ఇంటిని చుట్టుముట్టి ఎవర్నీ బయటకు రానీయలేదు. బయటవారిని కూడా లోపలికి పంపించడం లేదు. పోలీసుల కళ్లు గప్పి నిర్బంధాన్ని దాటుకొని పరిటాల సునీత బయటకు వచ్చారు. పోలీసులు అడ్డుకుంటున్నా ముందుకు వెళ్తేందుకు యత్నించారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పరిటాల సునీత నిరసన ప్రదర్శన చేశారు. చిత్తూరు జిల్లా చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బంద్ రోజు ఆర్టీసీ బస్సు డిపో నుంచి బయటకు రావడంతో ఆగ్రహించి టిడిపి శ్రేణులు బస్సు అద్దాలు పగలకొట్టారు. దీంతో పోలీసులకు, టిడిపి శ్రేణులకు మధ్య వాగ్వాదం జరిగింది. టిడిపి శ్రేణులను అరెస్టు చేసేందుకు పోలీసులు రావడంతో నడి రోడ్డుపై పడుకొని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ నిరసన వ్యక్తం చేశారు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురంలో ఉద్రిక్తత పరిస్థితులు కనిపించాయి. పట్టణం శ్రీకంఠపురం వద్ద టిడిపి శ్రేణులు, ఆందోళనకారులు ఆర్టీసీ బస్‌కు గాలి తీసివేశారు. షాపులు, హోటళ్లు మూయించారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉన్న టైంలో ఆందోళనలకు అనుమతి లేదంటూ నిరసనకారులను అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు పోలీసులు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం స్వచ్ఛందంగా బందులో పాల్గొంది. కళ్యాణదుర్గంలో అర్టీసి బస్సులను ఆపేసి రోడ్డుపై బైఠాయించారు టిడిపి ఇన్ చార్జ ఉమామహేశ్వర నాయుడు. ఆయన్ని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కాసేపు వాగ్వాదం జరిగింది. పరిస్థితి అదుపు చేసేందుకు ఆయన్ని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఉండవల్లిలో టీడీపీ కార్యకర్తల ఆందోళన చేపట్టారు. సీఎం దిష్టి బొమ్మ తగలబెట్టేందుకు యత్నించారు.

# సంపాదకీయం

మంగళవారం 12-09-2023

## న్యూఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం

జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా విడుదల చేసే జాయింట్ డిక్లరేషన్ కు సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. ఈ న్యూఢిల్లీ డిక్లరేషన్ లోని మొత్తం 83 పేరాలను ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా ఆమోదించాయి. జీ 20 సదస్సు సందర్భంగా భారత్ రూపొందించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కు సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. జీ 20 అధ్యక్ష దేశంగా భారత్ కు ఇది గొప్ప విజయంగా భావించవచ్చు. అంతకుముందు, రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన పేరాపై కొన్ని అభ్యంతరాలు రాగా, ఆ పేరాలో భారత్ పలు మార్పులు చేసింది. జీ 20 సదస్సు జరుగుతున్న భారత్ మండపం లో సభ్య దేశాల ప్రతినిధుల మధ్య రెండో సెషన్ చర్చ జరుగుతున్న సమయంలో న్యూఢిల్లీ డిక్లరేషన్ కు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం లభించిన విషయాన్ని భారత ప్రధాని మోదీ వెల్లడించారు. అందరి సహకారం, కృషితో ఇది సాధ్యమైందన్నారు. "ఇప్పుడే శుభవార్త తెలిసింది. మా టీమ్స్ కృషి, మీ సహకారంతో న్యూఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం లభించింది" అని మోదీ ప్రకటించారు. "ఇందుకు సహకరించిన, కృషి చేసిన భారత మంత్రులు, అధికారుల బృందానికి, షేర్పాలకు, ఇతర అధికారులకు ధన్యవాదాలు" అన్నారు. జీ 20 సదస్సులో సభ్య దేశాల అధినేతలు సంయుక్తంగా ప్రకటించాల్సిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం లభించడం కొంత సమస్యగా మారింది. రష్యా – ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన అంశంపై డిక్లరేషన్ లో పేర్కొన్న లైన్స్ ను కొన్ని సభ్య దేశాలు, ముఖ్యంగా అమెరికా, యూరోప్ దేశాలు వ్యతిరేకించాయి. దాంతో, ఆ పేరాలో భారత్ పలు మార్పులు చేసింది. "రెండు రోజుల ఈ సదస్సులో కీలక నేతలు కొన్ని విలువైన సూచనలు చేశారు. మరి కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలూ తీసుకొచ్చారు. వీటన్నింటినీ పున:సమీక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత మాపై ఉన్నాయి. ఈ సదస్సులో చర్చించిన అంశాలపై వర్చువల్‌గా రివ్యూ చేసుకోవాలని ప్రతిపాదిస్తున్నాను. నవంబర్‌లో ఈ వర్చువల్ భేటీ చేయాలని భారత్ ప్రతిపాదిస్తోంది'' ఐక్యరాజ్య సమితి గురించి ప్రస్తావించారు. ఐరాస స్థాపించినప్పటికి ఇప్పటికి ప్రపంచం చాలా మారిపోయిందని, ఈ మార్పులకు అనుగుణంగా యూఎన్ లో సంస్కరణలు చేయాల్సిన అవసరముందని సూచించారు. "ఐక్యరాజ్య సమితి స్థాపించినప్పుడు ప్రపంచం వేరు. ఇప్పుడు పరిస్థితులు వేరు. అప్పట్లో కేవలం 51 దేశాలకే సభ్యత్వం ఉండేది. ఇప్పుడా సంఖ్య 200కి చేరుకుంది. కానీ శాశ్వత సభ్యత్వం ఉన్న దేశాల సంఖ్యలో మాత్రం మార్పు రాలేదు. అప్పటికి ఇప్పటికి ప్రపంచం చాలా మారిపోయింది. ఇప్పటికి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు రావాల్సిన అవసరముందని ప్రధాని మోడీ తేల్చి చెప్పారు. జీ20 సదస్సులో కల్చర్ కారిడార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కల్చరల్ కారిడార్ జీ20 సభ్యులు, ఆహ్వానిత దేశాల భాగస్వామ్య వారసత్వాన్ని సూచిస్తుంది. ఇది జీ20 సభ్యులు, 9 ఆహ్వానిత దేశాల గుర్తింపు చిహ్నాలు.. గుర్తించదగిన సాంస్కృతిక వస్తువులు.. వారసత్వాన్ని కలిగి ఉంటుంది. ఈ కల్చర్ కారిడార్ విభిన్న సాంస్కృతిక వ్యక్తీకరణల అవగాహన.. వారసత్వాన్ని ప్రోత్సహించడానికి, జ్ఞానాన్ని పంచుకోవడం, చేరిక, సమానత్వం కోసం.. భాగస్వామ్య గుర్తింపు భావాన్ని పెంపొందించడానికి శక్తివంతమైన వేదికగా పనిచేస్తుంది. ఈ ప్రాజెక్ట్ భారతదేశం జీ20 థీమ్ 'వసుధైవ కుటుంబం', కల్చర్ వర్కింగ్ గ్రూప్ (అచిఉ) హాల్‌మార్క్ క్యాంపెయిన్ 'కల్చర్ యూనైట్స్ ఆల్' ఆధారంగా రూపొందించారు. జీ20 సదస్సు జరిగే భారత మండంపలో దీనిని ఆవిష్కరించి.. రెండు రోజుల పాటు ప్రదర్శించారు. దీనిలో దేశాల వారీగా జీ20 సభ్యులు, 9 ఆహ్వానిత దేశాల సాంస్కృతిక వస్తువులు, వారసత్వ వివరాలను ప్రతినిధులకు తెలిసేలా.. ఏర్పాట్లు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకోకి గ్యావెల్ కు జీ 20 అప్పగించారు. వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జీ20 సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు ప్రధాని మోదీ. ఇందుకు సంకేతంగా గ్యావెల్ అప్పగించారు. తనకు ఎంతో సన్నిహితుడైన లూయిజ్‌కి గ్యావెల్ అందిస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో స్పందించారు. గాంధీజీకి నివాళులర్పించడం ఎంతో భావోద్వేగానికి గురి చేసిందని వెల్లడించారు. అహింసా మార్గంలో దశాబ్దాల పాటు ముందుకు నడిచారని, అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసలు కురిపించారు. అంత గొప్ప వ్యక్తికి ఇలా శ్రద్ధాంజలి ఘటించడం చాలా ఉద్వేగంగా అనిపించిందని వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో మహాత్మా గాంధీజీ స్ఫూర్తి తప్పకుండా ఉంటుందని చెప్పారు. జీ20 2024 అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై బ్రెజిల్ అధ్యక్షుడు సంతోషం వ్యక్తం చేశారు. అంచనాలకు అనుగుణంగానే చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. జీ20 ని జియో పొలిటికల్ వివాదాలతో విడదీయటం సరికాదని తేల్చి చెప్పారు. కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, ఈ సమస్యపై దృష్టి సారించాలని సూచించారు. "బ్రెజిల్‌లో జరగనున్న జీ20 సదస్సులో మేం మూడు అంశాలకు ప్రాధాన్యతనివ్వనున్నాం. ఆకలిపై పోరాటం చేయడం, సుస్థిరాభివృద్ధి సాధించడం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకొచ్చేలా ప్రయత్నించడం. వీటిపైనే దృష్టి సారిస్తాం. జీ20ని జియోపొలిటికల్ అంశాలతో విడదీయడం సరికాదు. కేవలం డబ్బుల గురించే కాదు. ప్రజల ఆకలి గురించీ పట్టించుకోవాలి. సుస్థిరాభివృద్ధి ప్రమాదంలో పడుతోంది. ఆదాయంలో అసమానతలు ఉన్నప్పుడే ఇలాంటి సమస్యలు ఎదురవుతాయి''

# మహిమాన్వితుడు శ్రీ ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి.




కౌతాళం సెప్టెంబర్ 11 విభారె న్యూస్. కొలిచిన వారికి కొంగు ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి. కలియుగంలో వీరభద్ర అంశతో జన్మించి తపోసిద్ధితో సిద్ధ పురుషుడిగా ఉరుకుంద గ్రామంలో 16 -17 శతాబ్దాల మధ్యకాలంలో అనేక మహిమలు చాటిన మహోన్నతుడు ఈరన్న స్వామిగా ప్రసిద్ధి పొందాడు. నమ్మి కొలిచిన వారిని వెన్నంటే ఉంటూ కాపాడతారనే భక్తుల విశ్వాసం. ఇక్కడి అశ్వర్థ వృక్షంలో నిలయమై పూజలు అందుకుంటున్న స్వామి శైవ భక్తులకు వీరభద్రునిగా, వైష్ణవ భక్తుల ఉగ్ర నరసింహునిగా అనుగ్రహిస్తున్నారు. ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మారింది. ప్రతి ఏటా శ్రావణ, కార్తీక మాసాలలో విశేష పూజలు జరుగుతాయి. ఈ మాసాలలో లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి తమ మొక్కులు చెల్లిస్తారు. ముఖ్యంగా సోమ, గురువారాలు, అమావాస్య దినాలలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. భక్తులు ఉదయాన్నే స్నానాలు ఆచరించి శుచి, శుభ్రంగా ఎడ నైవేద్యాన్ని విధి ప్రాంతంలో వండి స్వామివారికి నైవేద్యం సమర్పిస్తారు. కొందరు బియ్యం, కంది బ్యాళ్లు, బెల్లం, గోధుమ రవ్వ ను గుడిలో సమర్పించుకుంటారు. అత్యధికంగా భక్తులు తలనీలాలను సమర్పించడం ఆనవాయితీ. జిల్లా వాసులే కాక అటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుండి భక్తులు వస్తారు. ప్రస్తుతం ఏడాది



పొడవునా భక్తులు వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు ఉన్నాయి. పుణ్యస్నానాలకు తుంగభద్ర కాలువ ఒడ్డున దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. శ్రావణ, ఆషాడ మాసాలలో 4 సోమవారాలు, 5 గురువారాలలో ప్రత్యేక పూజలు జరుగును. 4 వ సోమవారం 11.09.2023 న దేవాలయం నుండి సాయంత్రం 5 గంటలకు స్వామివారి పల్లకి సేవ దేవాలయ అర్చకులు,




పండితులు, భక్తులు చే ప్రారంభమై కోసిగి మండలంలోని కందుకూరు గ్రామం వద్ద తుంగభద్ర నది తీరం వరకు సాగినది. అక్కడ స్వామి మూర్తికి స్నానం చేయించి తిరిగి వచ్చే క్రమంలో గ్రామ ప్రజల పూజలు అందుకుంటూ రాత్రి 9 గంటలకు గుడి ప్రాంగణం చేరుకుంది. ఆలయ పాలక మండల అధ్యక్షులు నాగరాజ్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారిని శ్రీమతి వాణి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఆలయ అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దాతలు ఇచ్చే విరాళాలతో నిత్యాన్నదానం, గోశాల నిర్వహించడం జరుగుతుంది.

## పాపం..వాళ్లిద్దరికి ఎమ్మెల్సీ ఛాన్స్ లేనట్టే

హైదరాబాద్, సెప్టెంబర్ 11, తెలంగాణ సీఎం కేసీఆర్ కొత్తగా ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేయక తప్పదన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం పంపిన పేర్లను ఆమోదించేందుకు గవర్నర్ సిద్ధంగా లేరని తెలుస్తోంది. ఇప్పటికే ఖాళీ అయిపోయి చాలా కాలంఅయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలను నామినేటెడ్ కోటాలో భర్తీ చేసేందుకురాష్ట్రమంత్రివర్గం జూలై 31న జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నా ఇంకా దానికి గవర్నర్ ఆమోదముద్ర లభించలేదు. ప్రభుత్వం పంపిన ఫైళ్లను రాజ్‌భవన్ పరిశీలిస్తూ ఉన్నది. నెల రోజులు దాటినా వారిద్దరి నియామకాలపై గవర్నర్ నిర్ణ యం తీసుకోలేదు. వారికి అర్హతలు లేవన్నట్లుగా మాట్లాడటం తో...ఇకఫైల్ పెండింగ్ లోనే ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్? తంది. ప్రభుత్వం నుంచి ఫైళ్లు వచ్చిన వెంటనే ఆమోదం తెలపలే నని, వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించిన తర్వాతనే తగిన నిర్ణయంతీసుకోవడం వీలవుతుందని, అందువల్లనే సమయం పడుతున్నదని గవర్నర్ ప్రకటించారు. వారిద్దరూ ప్రభుత్వం పేర్కొన్న కేటగిరీలో ఫిట్ అవుతారో లేదో? ఒక నిర్ణయానికి రావడానికి పరిశీలన చేయాల్సి ఉన్నదని, ఆ కారణంగానే ఇంకా ఆమోదం తెలపకుండా అబ్జర్వేషన్‌లో పెట్టినట్లు స్వయంగా గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర తొలి మహిళా గవర్నర్‌గా నియమితు లైన తర్వాత నాలుగేండ్లు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రాజ్‌భవన్‌లో శుక్రవారం నిర్వహిం చిన కార్యక్రమంలో నామినేటెడ్ ఎమ్మెల్సీ ఫైల్‌కు సంబంధించిన వివరా లను తమిళిసై సౌందర్ రాజన్ వెల్లడించారు. దీంతో సానుకూల ఫలితం వచ్చేంతవరకూ వెయిట్ చేయడం మినహా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణకు మరో అవకాశం లేకుండాపోయింది. గతంలో సోషల్ సర్వీస్ విషయంలో కౌశిక్‌రెడ్డి ఫైల్‌కు సైతం గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో ఆ ప్రయత్నం నుంచి ప్రభుత్వం వెనుకడుగు వేయక తప్పలేదు. రాజకీయాలతో సంబంధం ఉన్న వ్యక్తులకు ఎమ్మెల్సీ అవకాశాలను కల్పించుకునే స్వేచ్ఛ పార్టీలకు ఉంటుందిగానీ గవర్నర్ నామినేటెడ్ విషయంలో అర్హతలు, ప్రామాణికాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆమె నొక్కిచెప్పడంతో పరోక్షంగా వారికి తగిన అర్హతలు లేవన్న అంశాన్ని బహిర్గతం చేసినట్లయింది. నెల రోజులుగా ఈ ఫైల్ ఆమోదానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నప్పటికీ గత నెల 25న సచివాలయ ప్రాంగణంలో ఆలయాల ప్రారంభోత్సవానికి స్వయంగా సీఎం ఆహ్వానం పలికి స్వాగతించడంతో ఆమోదం లభిస్తుందని అనుకున్నారు. కానీ అది జరిగిపోయి కూడా పది రోజులు దాటింది. అయినా ఈ ఫైల్‌కు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. గవర్నర్ కేసీఆర్ ను పొగుడుతున్నారు. సూపర్‌సీఎం అంటున్నారు కానీ.. బిల్లులు, ఎమ్మెల్సీల ఫైల్స్ పై సంతకం పెట్టేందుకు సిద్ధంగా లేరు. రాజ్‌భవన్‌కు, ప్రభుత్వానికి మధ్యస్నేహపూర్వకసంబంధాలుకొనసాగితే అనేక భిన్నాభిప్రాయాలకు తావు ఉండదని తమిళిసై అంటున్నారు. గతంలో గవర్నర్ నరసింహన్‌తో నామినేటెడ్ ఎమ్మెల్సీ విషయంలో పెద్దగా చిక్కులు ఎదురుకానప్పటికీ తమిళిసై వచ్చిన తర్వాత తొలుత కౌశిక్‌రెడ్డి, ఇప్పుడుదాసోజుశ్రవణ్, కుర్ర సత్యనారాయణకు ఇబ్బందులొచ్చాయి.

## లిక్కర్ స్కాంలో మళ్లీ దూకుడు




హైదరాబాద్, సెప్టెంబర్ 11, ఢిల్లీ లిక్కర్ స్కాం రాజకీయంగా ఎంతో ప్రాధాన్యమున్న కేసు. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా ఇప్పటికీ జైల్లో ఉన్నారు. అయితే కొంత కాలంగా ఈ కేసులో దర్యాప్తు సంస్థల దూకుడు తగ్గింది. అప్రూవర్లుగా మారుతామన్న వారందరి విజ్ఞప్తులు ఆమోదిస్తోంది. ముఖ్యంగా సౌత్ లాబీకి చెందిన ఎక్కువ మంది నిందితులు క్షమాభిక్ష పిటిషన్లు దాఖలు చేశారు. దర్యాప్తు సంస్థలు కూడా సానుకూలత తెలిపాయి. తాజాగా లిక్కర్ కేసులో పేరున్నా ఇప్పటి వరకూ ఒక్క సారి కూడా విచారణకు హాజరు కాని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అప్రూవర్ అయ్యారు. గుంభనంగా సాగిన ఈ వ్యవహారంలో ఈడీ కీలక చర్యలు తీసుకోబోతందన్న ప్రచారం ఢిల్లీలో గుప్పుమంటోంది. గత వారం రోజులుగా ఈడీ అధికారులు ఢిల్లీ లిక్కర్ సాకంలో కీలక వ్యక్తుల్ని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్సీ కవిత వద్ద గతంలో ఆడిటర్ గా పని చేసిన బుచ్చిబాబును రెండు రోజుల పాటు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి చెప్పిన సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి జరిగిన నగదు లావాదేవీల అంశంపైనా మరికొంత మందిని ప్రశ్నించినట్లుగా ఈడీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేతకు ఢిల్లీలో అన్ని పనులు చక్క బెట్టే వ్యక్తిని కూడా ప్రశ్నించినట్లుగా చెబుతున్నారు. త్వరలో కొంత మందికి నోటీసులు జారీ చేయబోతున్నారని.. విచారణకు పిలవబోతున్నారని అంటున్నారు. గతంలో ఢిల్లీలో కవితను విచారణను పిలిచి.. ఆమెకు సంబంధించిన ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఈడీ వాటిని విశ్లేషించింది. వాటి నుంచి ఎలాంటి సమాచారం సేకరించారో స్పష్టత లేదు కానీ.. సీబీఐ కోర్టుకు సమర్పించిన వివిధ పత్రాల్లో ఎమ్మెల్సీ కవితపై నిర్దిష్టమైన ప్రయోజనం పొందారని.. ఢిల్లీ లిక్కర్ స్కాంతో వచ్చిన సొమ్ముతో ఆస్తులు కూడా కొన్నారని వెల్లడించారు. తర్వాత ఇక కవితను విచారణకు పిలవలేదు. సౌత్ లాబీలో కీలక నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డితో పాటు మాగుంట రాఘవరెడ్డి కూడా అప్రూవర్లుగా మారారు. ప్రస్తుతం వారు బెయిల్ మీద ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో నిందితుల వద్ద నుంచి లంచాలు తీసుకున్నారని ముగ్గురు ఈడీ అధికారులను ఇటీవల సీబీఐ అరెస్టు చేసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలతో వారిని అరెస్టు చేశారు. ఈడీకి సంబంధించిన పవన్ కార్తికేయ అనే అసిస్టెంట్ డైరెక్టర్ రూ. 5 కోట్లు లంచం తీసుకుని కేసును నీరుగార్చరనే ఆరోపణలతో పవన్ తో పాటు అతని సిబ్బంది మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈడీ ఉన్నతాధికారులే ఆయనపై సీబీఐకి కంప్లైంట్ ఇచ్చింది. ఈ వ్యవహారం తర్వాత ఈడీ దూకుడు పెంచడం సహజంగానే సంచలనంగా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కాంకు రాజకీయ పరిణామాలకు గట్టి లింక్ ఉంది. ఎందుకంటే నిందితులంతా ముఖ్య రాజకీయ పార్టీలకు చెందిన వారే. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కుమార్తె.. వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మరో ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడి సోదరుడు, టీటీడీ బోర్డు మెంబర్ శరత్ చంద్రారెడ్డి వంటి వారు ఉన్నారు. ఇక ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను కూడా సీబీఐ ఓ సారి ప్రశ్నించింది.

## సోషల్ మీడియా స్టార్లకు గాలం

హైదరాబాద్, సెప్టెంబర్ 11, ఎన్నికల ప్రచారంలో కొత్త పోకడ మొదలైంది. ప్రత్యర్థులను డామినేట్ చేసేందుకు సోషల్ మీడియాను ప్రచార అస్త్రంగా మలుచుకుంటున్నారు నాయకులు. నిత్యం ప్రజలతో మమేకం అయ్యేందుకు సోషల్ ఫ్లాట్ ఫామ్స్ వేదికగా కొత్త ప్యాకేజీలకు తెరలేపారు. ఖర్చు తక్కువ, ప్రచారం ఎక్కువ కావడంతో సోషల్ మీడియాలో హల్చల్ చేసేందుకు నేతలు రెడీ అయ్యారు. ప్రతి ఒక్కరి చేతుల్లో ప్రజంట్ సెల్‌ఫోన్ కామన్ అయిపోయింది. లేచింది మొదలు పడుకునే వరకు ఫోన్ చూసే వారు లక్షల్లో ఉండడంతో ప్రచారానికి ఇది కరెక్ట్ వే అనుకుంటున్నారు నేతలు. చేసిన పనిని.. చేయబోయే పనులను.. తమ ప్రచార కార్యక్రమాల్ని పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం సోషల్ మీడియా సెలబ్రిటీలను తమ ప్రచార క్యాంపెనర్లుగా వినియోగించుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల వద్దకు వెళ్లే విధానాలను వారితో మరింత చర్చించి ముందుకు వెళ్లాలనుకుంటున్నారు. ప్రచార అవసరానికి తమ ప్రధాన ఆయుధం సోషల్ మీడియా అని చాలామంది లీడర్స్ నమ్ముతు న్నారు. అందరి వ్యూ ఒకటే అయినా తమదైన శైలిలో ప్రజల్లో ఉండేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎన్నికలకు సోషల్ మీడియా టీంను రెడీ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రతిభ ఉన్న, అనుభవజ్ఞులైన వారిని ఎంచుకునే పనిలో పడ్డారు. స్క్రిప్ట్ మొదలు ప్రచార శైలి భిన్నంగా ఉండాలనుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేందుకు తమ ప్రచార మార్కును రెడీ చేసుకుంటున్నారు. అందుకోసం సోషల్ మీడియాకు ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నారు. జనంలోకి వెళ్లేందుకు దగ్గరి మార్గం సులువైన మార్గం సోషల్ మీడియానే అన్నది ఇప్పుడు చాలామంది ఒపెనియన్. దీంతో పలువురు యూట్యూబ్ స్టార్లు, స్క్రిప్ట్ రైటర్లకు డిమాండ్ పెరిగింది. వారంతా ఇప్పుడు భారీ మొత్తంలో ప్యాకేజీ డిమాండ్ చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది. ముఖ్యంగా మిలియన్లలో రీచ్, లక్షల్లో సబ్‌స్క్రైబర్స్ ఉన్న సోషల్ మీడియా స్టార్లకు గాలం వేస్తున్నారు నేతలు.

## 119 నియోజకవర్గాల్లో 6003 దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 11, తెలంగాణ బీజేపీ టికెట్లకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. 119 స్థానాలకు గాను 6003 దరఖాస్తులు వచ్చాయి. తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే టికెట్లకు చివరి రోజు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆదివారం ఒక్కరోజే 2781 దరఖాస్తులు వచ్చాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 4 నుంచి 10 వరకు మొత్తంగా 6,003 అప్లికేషన్లు వచ్చాయని తెలుస్తోంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు బీజేపీ దరఖాస్తులు ఆహ్వానిం చింది. దీంతో ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు భారీగా పోటీ పడ్డారు. ఒక్కొక్కరూ 3, 4 స్థానాలకు అప్లై చేసుకున్నట్లు తెలుస్తోంది. సికింద్రా బాద్ నుంచి మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, దుబ్బాక నుంచి రఘునందన్ రావు, శేరిలింగంపల్లి నుంచి గజ్జల యోగానంద్, రాజేంద్ర నగర్ నుంచి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, షాద్ నగర్ నుంచి మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి, సనత్ నగర్ నుంచి ఆకుల విజయ, జనగామ నుంచి బేజాది బీరప్ప, పాలకుర్తి నుంచి యొడ్ల సతీష్ కుమార్, ముషీరాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ కూతురు బండారు విజయలక్ష్మి, గాంధీ నగర్ కార్పొరేటర్ పావని దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 4న 182 దరఖాస్తులు రాగా, 5న 178, 6న 306, 7న 333, 8న 621 , 9న 1603, 10వ తేదీన 2781 దరఖాస్తులు వచ్చాయి

## రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి

### పద్నాలుగు మందికి గాయాలు

కుప్పం తమిళనాడు సరిహద్దులోని నాట్రాం పల్లి లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో ఏడుగురు మృతి చెందగా పద్నాలుగుమందికి గాయాలలయ్యాయి. తమిళనాడు పేరునాంబట్ కు చెందిన 25 మంది ధర్మస్థల వెళ్లి వస్తున్నసమయంలో వారి టెంపో ట్రావెలర్ బ్రేక్ డౌన్ అయింది. దాంతో ప్రయాణికులు ఆగిన టెంపో ట్రావెలర్ ముందు నిలబడి వున్నారు. ఆదే సమయంలో ఒక లారీ వెనకనుంచి వచ్చి టెంపో ట్రావేలర్ ను ఢీకొంది. దాంతో టెంపో ముందున్న జనం పైకి దూసుకెళ్లింది. ఏడుగురు ప్రమాదస్థలం లోనే మృతి చెందారు. మరో 14 మందికి గాయాలు అయ్యాయి. వారందరిని స్థానిక ఆసుపత్రికి తరలించారు

## మైదుకూరులో బంద్ ప్రశాంతం

కడప తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మైదుకూరులో బంద్ నిర్వహించారు. మైదుకూరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మైదుకూరు టిడిపి ఇన్చార్జి పుట్ట సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బంద్ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు నిలిచిపోయాయి. నిరసనకారులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ చంద్రబాబు అరెస్ట్ ను ఖండించారు. ఈ నేపధ్యంలో పోలిసులకు టీడీపీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. తరువాత టీడీపీ ఇంచార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ ను అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు.

## బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

విజయవాడ ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు బైపాస్ శివ సాయి హోటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మైలవరం విజయవాడ జాతీయ రహదారిపై మద్యం మత్తులో ఒక వ్యక్తి బైక్ నడుపుతూ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జి కొండూరు ఎస్సై ధర్మరాజు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు...

## నంద్యాలలో భారీ బందోబస్తు

నంద్యాల బంద్ కారణంగా నంద్యాల జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు కు కోర్టు రిమాండ్ విధించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు, నంద్యాల జిల్లాలో సోమవారంరోజు తెల్లవారుజాము నుండి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి , నంద్యాల టౌన్ లో స్వయంగా బందోబస్తు విధులను పర్యవేక్షించారు. భాగంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారులపైన, ముఖ్య కూడళ్లలో, బస్టాండ్ లలో, రైల్వే స్టేషన్ లలో, ముఖ్య ప్రభుత్వ కార్యాలయాల వద్ద పికెట్లు, పెట్రోలింగ్ ఏర్పాట్లు చేసి.పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఏ విధమైన అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించడం జరిగింది.

# కలిసి పోటీకే జనసేన, టీడీపీ నిర్ణయం ?

TDP JANA SENA

విజయవాడ, సెప్టెంబర్ 11, జనసేనాని అభిప్రాయాన్ని ఆ పార్టీలోనే చాలామంది వ్యతిరేకించారు. టీడీపీతో కలిస్తే నష్టం అని, సొంతగా పోటీ చేయాల్సిందేనని అధినేతకు విన్నవించుకున్నారు. అయినా కూడా అంతిమ నిర్ణయాన్ని పవన్ కే వదిలేశారు. కానీ చంద్రబాబు అరెస్ట్ తర్వాత పరిస్థితిలో మార్పు స్పష్టంగా కనపడుతోంది. చంద్రబాబుకి మద్దతుగా జిల్లాల నుంచి టీడీపీ నేతలతోపాటు, జనసేన నేతలు కూడా ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేశారు. చంద్రబాబుకి మద్దతు తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తాయని జనసేన నేతలు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో టీడీపీకి పోటీగా మెసేజ్ లు పెట్టారు, వైసీపీని ట్రోల్ చేశారు. అయితే పవన్ కల్యాణ్ ని ఏపీకి రాకుండా పోలీసులు చేసిన ప్రయత్నం వారిలో మరింత కసి రాజేసింది. చంద్రబాబు అరెస్ట్ ని ఖండించిన జనసేన నేతలు, తమ నాయకుడి విషయంలో కూడా తేడా జరిగే సరికి మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ ఏపీకి రావాలంటే ప్రత్యేక అనుమతి కావాలా అంటూ ప్రశ్నించారు. పవన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరించిందని అన్నారు. ఏపీకి వస్తూ, పవన్ రోడ్డుపై పడుకున్న సీన్ కూడా జనసైనికుల్లో బలంగా నాటుకుపోయింది. ఒకరకంగా సీఎం జగన్.. చంద్రబాబు, పవన్ ఇద్దర్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని జనసైనికులు నమ్ముతున్నారు. జగన్ పై ద్వేషం పెంచుకుంటున్నారు. ఇప్పటికిప్పుడు ఒంటరిగా ఎన్నికలకు వెళ్తే జనసేనకు పెద్దగా మేలు జరగదనే విషయం అందరికీ తెలుసు. అయితే టీడీపీతో పొత్తుకు వెళ్తే వాళ్లు ఇచ్చే సీట్లతో సర్దుకోవాలి. పొత్తు లేకుండా సొంతగా పోటీ చేస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి వైసీపీకి లాభం చేకూర్చినట్టవుతుంది. గతంలో పవన్ కల్యాణ్ కూడా ఇదే విషయంలో పార్టీ క్యాడర్ కి సర్దిచెబుతూ వచ్చారు. కానీ ఇప్పుడు ఆయన అంత విశదీకరించి చెప్పాల్సిన పరిస్థితి లేదు. జనసైనికులకు కూడా సీన్ అర్థమైంది. చంద్రబాబుపై వైసీపీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, రేపు పవన్ కల్యాణ్ పై కూడా ఇలాగే కక్షసాధిస్తారని అంటున్నారు జనసైనికులు. పవన్ ని ఏపీకి రాకుండా అడ్డుకోవడాన్ని దీనికి ఉదాహరణగా చెబుతున్నారు. అందుకే వైసీపీకి వ్యతిరేకంగా టీడీపీతో జట్టుకట్టాలనుకుంటున్నారు జనసైనికులు. టీడీపీతో కలసి వెళ్లాలనేది ఇన్నాళ్లూ జనసేనాని ఆలోచనగానే ఉండేది, కానీ ఇప్పుడది జనసైనికుల ఆలోచనగా మారింది. వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరు పార్టీకి, నేతలకు నష్టం చేకూరుస్తుందని వారు డిసైడ్ అయ్యారు. ఒంటరిపోరు జనసేనకు కాస్తో కూస్తో లాభం చేకూర్చినా, అంతిమంగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి, వైసీపీకి పెద్ద లాభం జరుగుతుందని అంటున్నారు. అందుకే చంద్రబాబు అరెస్ట్, పవన్ అడ్డగింతను అవకాశంగా తీసుకుని, రెండు పార్టీలు ఉమ్మడిపోరుకి సిద్ధమయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. ఒకరకంగా టీడీపీ, జనసేన మధ్య అపోహలు తొలగిపోయి, జట్టుకట్టడానిక సీఎం జగన్ ఓ అవకాశం ఇచ్చినట్టు అర్థమవుతోంది. మరి పవన్ నిర్ణయం ఎలా ఉందో చూడాలి. ఎన్నికలకు టైమ్ దగ్గరపడుతుండే సరికి పవన్ త్వరగా పొత్తులపై నిర్ణయం తీసుకోవాలని కూడా జనసైనికులు భావిస్తున్నారు. ఆ దిశగా పవన్ నుంచి ప్రకటన ఉంటుందేమో చూడాలి.

# ప్రజల్లోకి భువనేశ్వరి, బ్రాహ్మణి !

విజయవాడ, సెప్టెంబర్ 11, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు ఊహించనంతగా మారిపోతున్నాయి. సాధారణంగా ప్రతిపక్ష నేతల అరెస్టులు, వారిపై కక్ష సాధిస్తున్నారని ప్రజలు అనుకునే వ్యవహారాలను ఎన్నికలకు ఏడాది ముంద ప్రభుత్వాలు చేయవు. తప్పని సరిగా అరెస్టులు లాంటివి చేయాల్సి వచ్చినా .. వారిపై ఉన్న అభియోగాలు, ఆధారాలు అన్నింటినీ ప్రజల్లోకి పెట్టి వీలైనంతగా చర్చ పెట్టి అప్పుడు అరెస్ట్ చేస్తారు. వేధిస్తున్నట్లుగా అరెస్ట్ చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తమకు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలో రాజకీయ పార్టీలకు ఓ పక్కా ప్రణాళిక ఉంటుంది. ఇప్పుడు టీడీపీ.. తమకు అలాంటి అవకాశం వచ్చినట్లుగా నిర్ణయానికి వచ్చామని ఇక ఉపయోగించుకోవాలని రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ప్రజల్లోకి నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలు వెళ్లే అవకాశాలు ఉన్నాయని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం కోసం, ప్రజల కోసం కష్టపడుతున్న చంద్రబాబు, లోకేష్‌లపై వేధింపులకు పాల్పడుతున్నారని.. తప్పుడు కేసులో వేధిస్తున్నారని న్యాయం మీరే చెప్పాలని వారు ప్రజల వద్దకు వెళ్లే ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ పెద్దల్లో ఇప్పటికే ఓ కార్యాచరణ సిద్ధమయిందని చెబుతున్నారు. నారా లోకేష్ పైనా సీఐడీ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయనను కూడా అరెస్ట్ చేస్తామని పరోక్షంగా చెప్పారు. ఒక వేళ అదే జరిగితే పాదయాత్ర ఆపేయాల్సి ఉంటుంది. అందుకే.. వెంటనే.. విరుగుడుగా.. భువనేశ్వరి, బ్రాహ్మణిలు తెలుగుదేశం పార్టీ తరపున రంగంలోకి దిగుతారని.. లోకేష్ ఆపేసిన దగ్గర్నుంచి పాదయాత్ర చేయడమో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించడమో చేస్తారన్న వాదన వినిపిస్తోంది. రాజకీయాల్లో పండిపోయిన అందరికీ .. సానుభూతి ని మించిన అస్త్రం ఉండదని తెలిసి. వైఎస్ చనిపోయిన తర్వాత వచ్చిన సానుభూతి వెల్లువలో వైఎస్ జగన్ తడిచి ముద్దయ్యారు. ఉపఎన్నికల్లో భారీ విజయాలు సాధించారు. ఆదిలాబాద్ నుంచి చిత్తూరు వరకూ ఆ సానుభూతి వేవ్ కనిపించింది. గత ఎన్నికల్లోనూ ఆయన ఒక్క చాన్స్ అని వేడుకున్నారని ఆ సానుభూతే కనిపించింది కానీ టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత లేదన్న కొన్ని విశ్లేషణలు ఉన్నాయి. అదే ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండి.. ఇక ప్రతిపక్ష నేతలపై వేధింపులు అంటూ వారి కుటుంబసభ్యులు రోడ్డెక్కితే.. వచ్చే సానుభూతి వెల్లువ ఊహించడం కష్టమనే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా మహిళల్లో సానుభూతి పవనాలు వీస్తే ఫలితాలు పూర్తి స్థాయిలో ఏకపక్షమవుతాయన్న అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే జగన్ మోహన్ రెడ్డి తన కోసం పని చేసిన , పాదయాత్రలు.. ప్రచారాలు చేసిన తల్లి విజయలక్ష్మి, సోదరి షర్మిలను దూరం చేసుకున్నారు. అది కూడా చర్చకు పెట్టే అంశాలపై టీడీపీ దృష్టి పెట్టే అవకాశం ఉంది.రాజకీయ అధికారం ఎవరికైనా ప్రజలు ఇచ్చేదే. రాజ్యాంగం ద్వారా వచ్చేదే. ఆ అధికారాన్ని దుర్వినియోగంచ చేస్తున్నారని అనిపిస్తే.. ప్రజలు మరోసారి అధికారం అప్పగించడానికి సంశయిస్తారు. వేధింపులకు గురైన వారికి బాసటగా నిలుస్తారు. అనాదిగా వస్తున్న రాజకీయం అది. అయితే కక్ష సాధింపు రాజకీయాలు ఎప్పుడూ ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికల ఎజెండా కాలేదు. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఉండేది. ఇప్పుడు ఏపీలో ఆ తరహా రాజకీయాలు వచ్చాయి. అందుకే ఏపీ రాజకీయాల్లో రానున్న రోజుల్లో కీలక మార్పులు ఖాయమన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

# భారీగా పెరిగిన పండ్లతోటల సాగు

కర్నూలు, సెప్టెంబర్ 11, వర్షాలపై ఆధారపడి అదృష్టాన్ని పరీక్షించుకునే రైతులకు ఏటా కచ్చితమైన ఆదాయం లభించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పొడి భూముల్లో ఉద్యాన పంటలు కార్యక్రమం కింద రైతులకు మొక్కలు నాటే సమయం నుంచి 100 శాతం సబ్సిడీ ఇవ్వడంతోపాటు మూడేళ్లపాటు సాగు ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తోంది. దీంతో రాష్ట్రంలో పండ్ల తోటలు సాగు చేసే రైతుల సంఖ్య పెరిగింది. రైతులు స్థిరంగా లాభాల పంటను పండిస్తూ ఆర్థికంగా బలపడుతున్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను చూసి సంప్రదాయ పంటలు సాగు చేసే పొరుగు రైతులు కూడా పండ్ల తోటల సాగువైపు మళ్లుతున్నారు. సన్న, చిన్నకారు రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వమే దన్నుగా నిలుస్తుండటంతో దేశంలోనే 'హార్టీ కల్చర్ హబ్'గా ఏపీ అభివృద్ధి చెందుతోంది. 2018?19 వరకూ రాష్ట్రంలో 17,62,240 ఎకరాల్లో పండ్ల తోటలు సాగయ్యేవి. ఆ విస్తీర్ణం ప్రస్తుతం 19,97,467.5 ఎకరాలకు సాగు పెరిగింది. అంటే నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో 2,35,227.5 ఎకరాల్లో పండ్ల తోటల సాగు పెరిగింది. 2018?19లో 1,76,43,797 టన్నుల పండ్ల దిగుబడులు రాగా.. ప్రస్తుతం 2,03,70,557 టన్నులకు పెరిగింది. అంటే 27,26,760 టన్నుల దిగుబడి పెరిగింది. పండ్ల తోటలతో పాటు పూలు, కూరగాయలు కలిపి మొత్తం రాష్ట్రంలో 47.02 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వీటిద్వారా 3.63 కోట్ల టన్నుల దిగుబడులు వస్తున్నాయి.ప్రస్తుత ఏడాది 2023?24లో రికార్డు స్థాయిలో 75 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటల అభివృద్ధికి అవకాశం కల్పిస్తోంది. సాధారణంగా పండ్ల తోటల సాగు, అభివృద్ధి మోతుబరి రైతులు మాత్రమే చేసేవారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు ఇస్తుండటంతో సన్న, చిన్నకారు రైతులు కూడా పండ్ల తోటలను సాగు చేయగలుగుతున్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. వీరిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో పండ్ల తోటల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుండటం విశేషం. ఈ జిల్లాల్లో ప్రత్యేకంగా 10 వేల ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేస్తున్నారు. కాగా.. పొడి భూములు అధికంగా ఉండే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 వేల ఎకరాల్లోను, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11వేల ఎకరాల్లో పండ్ల తోటల అభివృద్ధి జరుగుతోంది.కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన ఈ రైతు పేరు నర్సిరెడ్డి. ఈయునకు అర ఎకరం పొడి భూమి ఉంది. వర్షాధారంగా పత్తి, మిరప వంటి పంటలు సాగు చేసేవాడు. ఋన్నీ అనుకూలిస్తే.. ఏటా రూ.15 వేల వరకు ఆదాయం వచ్చేది. వర్షాలు మొహం చాటేస్తే నష్టాలు చవిచూడాల్సి వచ్చేది. 2020 వరకు ఇదే పరిస్థితి. 2021?22లో డ్రైలాండ్ హార్టికల్చర్ స్కీమ్ కింద డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశాడుఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఇచ్చింది. పొలంలో గుంతలు తవ్వడం నుంచి మొక్కల వరకూ పూర్తిగా ప్రభుత్వమే రూ.1.70 లక్షల ఖర్చు భరించింది. తొలి ఏడాది రూ.22 వేలు, రెండో ఏడాది రూ.55 వేల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.లక్ష దాటుతుందని నర్సిరెడ్డి చెప్పాడు. ఈ పంట సాగువల్ల ఏటా ఆదాయం పెరుగుతూనే ఉంటుందంటున్నాడు. పండ్ల తోటల అభివృద్ధికి ఎకరాకు కనిష్టంగా రూ.40 వేల నుంచి గరిష్టంగా రూ.2.44 లక్షల వరకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తోంది. ఎకరాకు సగటున రూ.లక్ష వరకూ సబ్సిడీ ఇస్తోంది. 2023?24లో 75 వేల ఎకరాల్లో పండ్ల తోటల అభివృద్ధి జరుగుతోంది. మామిడి, చీనీ, నిమ్మ, కొబ్బరి, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ తదితర పండ్ల తోటలతో పాటు పూల తోటలను రైతులు అభివృద్ధి చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా హార్టికల్చర్ అభివృద్ధికి ఈ ఏడాది రూ.750 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 26 జిల్లాలకు సంబంధించి 64,544 ఎకరాల్లో పండ్ల తోటల అభివృద్ధికి అంచనాలు రూపొందించగా.. 63,250 ఎకరాలకు పరిపాలన అనుమతులు లభించాయి. మరోవైపు పండ్ల మొక్కలు నాటే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

# భారంగా మారుతున్న వేరుసెనగ పంట

అనంతపురం, సెప్టెంబర్ 11, అనంతపురం జిల్లా అంటేనే గుర్తుకొచ్చేది కరువు... వేరుశనగ పంట. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం కలిగిన ఈ ప్రాంతంలో తక్కువ వర్షానికైనా పండగలిగే పంట వేరుశనగ ఒక్కటే. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఏటా ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రకృతి తోడ్పాటు, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఈ ప్రాంత రైతుల్లో దశాబ్దకాలంగా వేరుశనగ సాగుపై ఆసక్తి తగ్గుతూ వస్తోంది. దీంతో, ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ పంట సాగు విస్తీర్ణం ప్రస్తుతం గణనీయంగా పడిపోయింది. 2011లో 20.11 లక్షలు సాగయ్యేది. క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం 4.77 లక్షల ఎకరాలకే పరిమితమైంది. గత 13 ఏళ్లలో 15.41 లక్షల ఎకరాల్లో సాగు తగ్గిపోయింది.వేరుశనగ సాగు పెట్టుబడి ఏటా పెరిగిపోతోంది 2011లో ఎకరం విస్తీర్ణంలో వేరుశనగ సాగుకు రూ.7,084 ఖర్చయ్యేది.ప్రస్తుతం ఈ ఖర్చు రూ.32 వేలకు చేరింది. దాదాపు నాలుగు రెట్లు పెట్టుబడి వ్యయం పెరిగింది.

అందుకు తగ్గట్టు పంట దిగుబడులు లేకపోవడం, వర్షాభావంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. 2017లో అత్యధికంగా ఎకరానికి 441 కిలోల దిగుబడి వచ్చింది. మిగతా ఏ సంవత్సరం కూడా 300 కిలోలకు మించి రాలేదు. తీవ్ర వర్షాభావం వల్ల 2016లో ఎకరానికి 87 కిలోలే దిగుబడి వచ్చింది.వేరుశనగ పంటకు నష్టం జరిగితే బీమా రూపంలో ప్రభుత్వం రైతులను ఆదుకునేది. 2011కు ముందు వరకూ త్రెస్‌హోల్డ్ ప్రకారం అంటే, మూడేళ్ల సగటు దిగుబడిని లెక్కించి దాని కంటే తక్కువ దిగుబడి వస్తేనే బీమా వచ్చేది. దీనివల్ల ప్రయోజనం లేదని బీమా విధానంలో మార్పులు తీసుకొచ్చారు. 2011 నుంచి వాతావరణ బీమాను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. పంట కాలాన్ని మూడు భాగాలుగా విడగొట్టి ఆ కాలంలో కురిసే వర్షపాతాన్ని బట్టి రైతులకు పరిహారం అందించే పద్ధతిని తీసుకొచ్చింది. ఈ విధానంలోనూ రైతులకు పరిహారం సరిగా రావడం లేదు. ఓ వైపు వర్షాలు లేక దిగుబడి రాకపోవడం, మరోవైపు ప్రభుత్వ సాయం లేకపోవడం వేరుశనగ సాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గడానికి ప్రధాన కారణం.

# ఈ క్రాప్ ఇబ్బందులు ఇంతింతికాదయా

విజయవాడ, సెప్టెంబర్ 11, ఇ-క్రాప్ ఉంటేనే రైతులకు పథకాలని ప్రభుత్వం చెప్పగా సదరు ఇ-క్రాప్ నమోదుల ప్రక్రియ ఏడాదేడాదీ మార్పులకు గురవుతోంది. ఒక సారి ఉన్న విధానం మరుసటి సీజన్‌కు ఉండట్లేదు. కొత్త విధానాన్ని క్షేత్ర స్థాయి సిబ్బంది ఆకళింపు చేసుకునేసరికే సమయమైపోతోంది. పై నుంచి వచ్చే ఒత్తిడితో ఆదరాబాదరగా నమోదుల వ్యవహారాన్ని మమ అనిపించడంతో అంతిమంగా రైతులు సర్కారీ స్కీంలను నష్టపోతున్నారు. కడకు పండించిన పంటలను సైతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనే వీల్లేని దారుణ పరిస్థితి. ఇ-క్రాప్ నిబంధనల్లో కౌలు రైతుల నమోదుకు స్పష్టమైన గైడ్‌లైన్స్ లేకపోవడంతో లక్షలాది కౌల్దార్లు తామే వాస్తవ సాగుదారులైనప్పటికీ గుర్తింపు కొరవడి అన్ని విధాలా నష్టపోతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సాగుల నమోదు (ఇ-క్రాప్) సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యాన్ని నిర్దేశించింది. కొన్ని చోట్ల గడువు సెప్టెంబర్ 15 అంటున్నారు. సరైన వానల్లేక ఈ మారు ఖరీఫ్ సాగు బాగా తగ్గింది. ఇప్పుడు పడుతున్న వర్షాలకు వీలున్న ప్రాంతాల్లో మెట్ట, ఆరుతడి పంటలు వేస్తున్నారు. సాధారణ సాగులో ఇప్పటికి 63 శాతం పంటలు సాగైనట్లు ప్రభుత్వం వెల్లడించింది.. కొన్ని చోట్ల 30 శాతం కంటే లోపు సేద్యం జరిగింది. అందుకే ఇ-క్రాప్ నమోదులు రాష్ట్రంలో 10-20 శాతం లోపే జరిగాయి. త్వరగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు వెంటపడుతున్నారు.అవినీతి, అక్రమాల ఆరోపణలతో ఇ-క్రాప్ యాప్‌లో ఈసారి జియోట్యాగింగ్ తీసుకొచ్చారు. ఆర్‌బికె సిబ్బంది నమోదు చేయాల్సిన పొలానికి 200 మీటర్ల పరిధిలోనే సర్వేనెంబర్ ఓపెన్ అవుతుంది. సిబ్బంది పొలాల వద్దకెళ్లి తీరాలి. గతంలో ఆఫీసుల్లో, ఎక్కడంటే అక్కడ కూర్చొని ఎంట్రీ చేసే వీలుండేది. కొత్త విధానంలో ఆ అవకాశం లేదంటున్నారు. మండల వ్యవసాయాధికారి (ఎఒ) సర్వేనెంబర్లను డౌన్‌లోడ్ చేసి గ్రామాల వారీగా ఆర్‌బికె సిబ్బందికి సెండ్ చేయాలి. వాటిని సిబ్బంది డౌన్‌లోడ్ చేసుకొని పొలాల వద్దకెళ్లి నమోదు చేయాలి. చాలా చోట్ల ఇప్పటికీ సర్వేనెంబర్ డౌన్‌లోడ్లు పూర్తి కాలేదు. ఒక పట్టాన డౌన్‌లోడ్ కావట్లేదు. పొలాల వద్దకెళ్లాక నిర్దేశిత సర్వే నెంబర్లు ఓపెన్ కావట్లేదు. ఓపెన్ అయ్యాక పది అంశాలు నమోదు చేయాలి. టెక్నికల్ ఎర్రర్స్ వలన చాలా సమయం పడుతోంది. ఎంట్రీలన్నీ పూర్తి చేశాక రైతుల నుండి డిజిటల్ వేలిముద్రలు తీసుకోవాలి. విఎఎ అథంటికేషన్ చేయాలి. అనంతరం విఆర్‌ఒ అథంటికేషన్ చేయాలి. ఈ ప్రాసెస్‌లో ఎర్రర్స్ వస్తున్నాయి. ఒక అధికారి నుంచి మరొక అధికారికి అథంటికేషన్ కోసం సెండ్, సబ్మిట్ చేసే క్రమంలో ఫార్మాట్, అందులోని అంశాలు కనిపించట్లేదు. దాంతో రైతులు, సిబ్బంది లబోదిబోమంటున్నారు. భూముల వివరాలను రెవెన్యూ డిపార్టుమెంట్ నుంచి తీసుకున్నారు. సర్వేనెంబర్లు, వాటి యజమా నుల సమాచారం తప్పుల తడకగా ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు అసలే లేవు. సిసిఆర్‌సి, ఇతర గుర్తింపు పత్రాలు ఉన్నా కౌల్దార్ల పేర్లు ఎక్కించలేదు.జియోట్యాగింగ్ వలన తప్పనిసరిగా సిబ్బంది ఫీల్డ్ విజిట్ చేయాల్సి ఉన్నా పంటల నమోదులో అక్రమాలకు వెసులుబాట్లు అలానే ఉన్నాయి. యాప్‌లో సర్వేనెంబర్ ఓపెన్ అయ్యాక రైతు వేయని పంటను వేసినట్లు రికార్డు చేసే అవకాశం ఇప్పటికీ ఉంది. అలా చేస్తే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంక్ రుణాలు తదితర విషయాల్లో అనర్హులకు లాభం, వాస్తవ రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కొత్త యాప్‌లోనూ లోపాలున్నాయని రైతులు వాపోతున్నారు.

# నిర్వీర్యమవుతున్న కార్పొరేషన్లు....

ఏలూరు, సెప్టెంబర్ 11, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉపాధి భద్రత కల్పించి వెన్నుదన్నుగా నిలిచిన బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయి. దీంతో వివిధ తరగతుల ప్రజలకు బ్యాంకు రుణాలతో ఉపాధి మార్గం ఎంచుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా తరగతుల ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వాల హాయాంలో బిసి, ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్లకు ప్రత్యేక స్థానం ఉండేది. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చాక కాపు కార్పొరేషన్‌ను సైతం ఏర్పాటు చేసింది. చదువుకుని ఉపాధి లేని నిరుద్యోగులకు కార్పొరేషన్లు అండగా నిలిచేవి. ప్రతియేటా లక్ష్యాలు నిర్దేశించుకుని బిసి, ఎస్‌సి, మైనార్టీలకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి మార్గం చూపేవి. కిరాణా కొట్లు, ఫొటో స్టూడియోలు వంటి ఎన్నో వ్యాపారాలు పెట్టుకోవడంతోపాటు, కార్లు వంటివాటితో ఉపాధి పొందేందుకు కార్పొరేషన్లు సహాయ పడేవి. ప్రతి యూనిట్‌కూ రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు వరకూ ఇచ్చిన పరిస్థితి కొనసాగేది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇచ్చిన పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన బిసి తరగతికి చెందిన కుటుంబాలకు బిసి కార్పొరేషన్ ద్వారా దాదాపు పది వేలకుపైగా యూనిటీట్లు మంజూరయ్యాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 15 వేల యూనిట్లు వరకూ ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తొమ్మిది వేలకుపైగా యూనిట్లు ఇచ్చారు. నిరుద్యోగులు, చదువుకోనివారు సైతం కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు పొంది లబ్ధి పొందారు. తీసుకున్న రుణంలో సగం సబ్సిడీ కింద ప్రభుత్వం భరించేది. రూ.లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. తీసుకున్న రుణంలో సగం సొమ్ము సబ్సిడీ కింద పోవడంతో లబ్ధిదారులకు ఎంతగానో మేలు జరిగేది. బ్యాంకు రుణాలు పొందిన కుటుంబాలకు ఏదోక ఉపాధి మార్గం దొరికేది. ఉపాధికి సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేస్తేనే కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు మంజూరయ్యేవి. దీంతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబమూ ఏదోక యూనిట్‌ను తప్పకుండా ఏర్పాటు చేసేవి. యూనిట్ ఏర్పాటుతో వచ్చే ఆదాయంతో ప్రతినెలా బ్యాంకు వాయిదాలు చెల్లించుకునేవారు. ఎంతోమంది కార్లు పొంది వాటిద్వారా ఉపాధి పొందారు. కార్పొరేషన్ రుణాల కింద కార్లు పొంది ఇప్పటికీ ఉపాధి పొందుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయివైసిపి ప్రభుత్వం వచ్చాక బిసి, ఎస్‌సి, మైనార్టీ, కాపు కార్పొరేషన్లే కాకుండా, బిసి సామాజిక తరతగతుల్లో అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించింది. అయితే నిధులు మాత్రం ఇవ్వలేదు. దీంతో ఛైర్మన్లుగా నియమితులైన వారు ఏం చేస్తున్నారో కూడా ఏఒక్కరికీ తెలియని పరిస్థితి ఉంది.

## ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అరెస్ట్ ని కర్నూలు బిఎస్పి ఖండిస్తుంది.




కర్నూలు, సెప్టెంబర్ 11 విభారె న్యూస్ :ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ గాడి అరుణ్ కుమార్ గారు, కర్నూలు అసెంబ్లీ అధ్యక్షులు కే మధుకర్, ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్ భాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లె రవికాంత్, నగర ట్రెజరర్ సొలమన్ పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్థాయి నాయకుడిని అరెస్టు చేసేటప్పుడు ముందుగా సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్టు చేయడానికి వైసిపి ప్రభుత్వం ప్రయత్నించిన పద్ధతి కక్ష సాధింపుకు నిదర్శనంగా కనిపిస్తుంది. ప్రతిపక్ష నాయకుల ఎడల, ప్రతిపక్ష పార్టీల ఎడల, ఈ ప్రభుత్వం అణచివేత ధోరణి ప్రజాస్వామ్యానికి గొడ్డెలి పెట్టు. ఈ అరెస్టును రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా జరిగిందని భావించడం తప్పేమీ కాదు. భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య పరిపాలన విధానాలకు భిన్నంగా రాజకీయ పార్టీల పట్ల అవలంబిస్తున్న ధోరణి మంచిది కాదు.జగన్మోహన్ రెడ్డి అనేక కేసుల్లో ముద్దాయిగా ఉండి తాను అక్రమ కేసుల్లో ఇరికించబడ్డారని చెబుతూ అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరిస్తున్న ప్రవర్తన తీరు గురించి ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరుచున్నాం. జగన్మోహన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడితే చట్ట ప్రకారం శిక్షార్హులే, ప్రభుత్వ సంస్థలు తమ జేబు సంస్థలు గా ఉపయోగించరాదని అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడడాన్ని కర్నూలు బిఎస్పి వ్యతిరేకిస్తుంది.గాడి.అరుణ్ కుమార్కర్నూలు జిల్లా ఇంఛార్జి ఒ కర్నూలు అసెంబ్లీ ఇంఛార్జి×

## శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణ కు భక్తుల విరాళం



శ్రీశైలం సెప్టెంబర్ 11 విభారె న్యూస్. శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దేవాలయం లో భక్తులకు ప్రతినిత్యం జరిగే అన్న ప్రసాద వితరణ కు గాను హైదరాబాద్ వాస్తవ్యులు బి. రమేష్ రు.2,00,002 లు విరాళాల కేంద్రం పర్యవేక్షకులు టి. హిమబిందుకు, శ్రీమతి ముదన సుకన్య ఇంకొల్లు, ప్రకాశం జిల్లా వారు రు.1,00,005 లు అన్న ప్రసాద వితరణ పర్యవేక్షకులు సి. మధుసూదన్ రెడ్డికి అందజేయడం జరిగినది. దేవాలయం వారు వీరికి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి శాలువాతో సత్కరించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

### జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 11 విభారె న్యూస్:- ఈ సెప్టెంబర్ నెల 9,10 తేదీలలో, తెనాలిలో రాష్ట్ర స్థాయి లో జరిగిన 4వ సబ్ జూనియర్ జంప్ రోప్ పోటీలలో, పేరాయిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తనూష మరియు ప్రణీతలు ఇద్దరూ ప్రథమ బహుమతిగా గోల్డ్ మెడల్స్ ను, మస్తాన్ బీ అనే విద్యార్థిని సైక్లింగ్ లో ద్వితీయ బహుమతిగా సిల్వర్ మెడల్ ను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాబడ్డారు



. ఈ సందర్భంగా విద్యార్థినిల కు అద్భుతమైన శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడైన శ్రీనివాసులురెడ్డిగారిని, పథకాలు సాధించిన విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన మహబూబ్ భాష గారు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు అభినందించారు.

# వైకాపాకు చివరి రోజులు దగ్గరపడ్డాయి

## మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 11 విభారె న్యూస్ : వైకాపా ప్రభుత్వానికి చివరి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. సోమవారం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రాష్ట్ర బంద్కు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ముందు జాగ్రత్తగా పోలీసులు భూమా అఖిలప్రియ ను గృహనిర్బంధంలో ఉంచారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులకు తమ సందేశాన్ని వీడియో రూపంలో పంపడం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ ప్రజలు మర్చిపోలేకపోతున్నారన్నారు. ఇది దురదృష్టకర సంఘటనగా ఆమె అభి వర్ణించారు. తెదేపా బందుకు పిలుపునివ్వడంతో ఆళ్లగడ్డ తాలూకాలో ప్రజలు స్వచ్ఛందంగా బందుకు సహకరించారని, దుకాణాలు మూసివేశారని, అలాగే ప్రైవేటు పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలు స్వచ్ఛందంగా తమ సంస్థలను మూసివేశాయని వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మన పరిస్థితి అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబు కంటే జగన్ యువతకు మంచి భవిష్యత్తును ఇస్తాడని నమ్మి ప్రజలు జగన్ కు పట్టం కట్టారని కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలే పోతున్నాయన్నారు. చదువుకు సంబంధం లేని ఉద్యోగాలను యువత చేస్తున్నారన్నారు. వారికి భవిష్యత్తు లేకుండా వైకాపా ప్రభుత్వం చేస్తుందన్నారు. సీమలో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని మాయమాటలు చెప్పి తిరిగి ఆ ఊసే లేకుండా చేశారన్నారు. ప్రజలకు మేలు చేసే ఆలోచన వైకాపాకు లేదన్నారు. చరిత్ర హీనులుగా వైకాపా మిగిలిపోతుంది అన్నారు. ప్రజలు వైకాపాకు ముగింపు చెప్పే రోజులు దగ్గర పడ్డాయి అన్నారు. గవర్నర్ సంతకం లేకుండానే జెడ్ ప్లస్ క్యాటగిరి సెక్యూరిటీ ఉన్న చంద్రబాబును అరెస్ట్ చేసిన తీరు బాధాకరమన్నారు. 48 గంటలు ఆయనను విశ్రాంతి లేకుండా బాధ పెట్టారన్నారు. బంద్ నిర్వీర్యం చేయాలన్న వైకాపా కుట్రలు సాగలేకపోయాయన్నారు. వైకాపా జెండా మోసిన వల్లే చంద్రబాబు అరెస్టుపై బాధపడుతున్నారన్నారు. చాలామంది పోలీసులు కూడా అధికారులు ఒత్తిడితో మనసు చంపుకొని విధి నిర్వహణ చేస్తున్నారని అఖిలప్రియ అన్నారు.

# రమణీయంగా సాగిన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం..

## ముఖ్య అతిథిగా హాజరైన వైయస్సార్సీపీ రాష్ట్ర యువజన నాయకులు శ్రీ వై ప్రదీప్ రెడ్డి





కోసిగి, సెప్టెంబరు 11(విభారె న్యూస్) శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో పవిత్ర శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా చివరి సోమవారం పురస్కరించుకొని ఉరుకుంద క్షేత్రం నుండి కందుకూరు వరకు స్వామివారి ఉత్సవమూర్తిని రమణీయంగా సాగిన మహాపల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చి, తుంగభద్ర నదిజలాలతో శాస్త్రోక్తంగా పుణ్యస్నానంను జరిపించారు.ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కందుకూరు గ్రామం తుంగభద్రనది తీరాన జరుగుతున్న ఈ పల్లకి మహోత్సవ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా వైయస్సార్సీపీ రాష్ట్ర యువజన నాయకులు శ్రీ వై ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ప్రదీప్ రెడ్డి ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం బోర్డు అధ్యక్షులు నాగరాజు గౌడ్,ఆలయ అర్చకులు వీరప్ప స్వామి,మండల కన్వీనర్ బెట్టనగౌడ్ స్వాగతం పలికారు.మహాపల్లకిలో ఉన్న ఉరుకుంద ఈరన్న స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కలు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో యంపీపీ ఈరన్న, నాడిగేని నాగరాజు,జగదీష్ స్వామి,దొడ్డి నర్సన్న,నరసింహులు గౌడ్,కాల్వ లక్ష్మయ్య,వీరస్వామి, కందుకూరు తాయన్న,యంపీటీసి మల్లయ్య,మాజీ యంపీటీసి రమేష్, పి.వెంకటేష్,పెద్ద బొంపల్లిఅంజి, దేవస్థానం బోర్డు సభ్యులు మల్లికార్జున గౌడ్,వీజేంద్ర రెడ్డి,బుళ్ళి నరసింహులు,వై.నర్సమ్మ,లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో అలరించిన గ్రామీణ క్రీడలు






కోసిగి,సెప్టెంబర్ 11 (విభారె న్యూస్) శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం సందర్భంగా కోసిగి మండలం పరిధిలోని కందుకూరు గ్రామంలో సోమవారం నాడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 210 కేజీల ఇసుక సంచిని, 170 రాతి గుండును కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ,షాపూర్ తాలూకా, శారదా హళ్లి గ్రామానికి చెందిన మరియప్ప ఎత్తి మొదటి బహుమతులు గెలుచుకున్నారు.అలాగే 190 కేజీల ఇసుక సంచిని 150 కేజీల రాతి గుండును ఎత్తి కర్ణాటక వాసి అయిన ఎల్లలింగా ద్వితీయ బహుబతి గెలుచుకున్నారు.అలాగే పరుగు పందెంలో పెద్దతుంబలం దొడ్డయ్య,మొదటి బహుమతి గెలుపొందారు.గెలుపొంది న వారికి శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం చైర్మన్ నాగరాజు గౌడ్, గ్రామ పెద్ద బెట్టప్ప గౌడ్, ఎంపిపి లవకుశ ఈ రన్న, నాడిగేని నాగరాజు, జగదీష్ స్వామి ఉరుకుంద దేవాలయం కమిటీ సభ్యులు బుల్లి నరసిములు, మల్లికార్జున గౌడ్, మరియు కమటి సభ్యులు నగదు బహుమతులను విజేతలకు అందజేశారు. ఇందులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టిపోలీస్ బందోబస్తు నిర్వహించారు.

# అపూర్వ సన్నివేశం... తండ్రికి తనయుడు సెల్యూట్

## తండ్రి ఎస్సై వెంకట్ రెడ్డికి సెల్యూట్ చేస్తున్న తనయుడు
## 2. సీఐ రమేష్ బాబు తో తండ్రి, కుమారుడు



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 11విభారె న్యూస్:- ఆళ్లగడ్డలో సోమవారం బంద్ సందర్భంగా ఒక అపూర్వ సన్నివేశం చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డికి స్పెషల్ పార్టీ ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి సెల్యూట్ చేశారు.

ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకునేరు. విధి నిర్వహణలో జిల్లా స్పెషల్ పార్టీ ౹ాఎ గా ఉన్న హర్షవర్ధన్ ను బందోబస్తు నిమిత్తం ఆళ్లగడ్డ కు డ్యూటీ వేశారు. సడెన్ గా ఎదురుపడ్డ కుమారుని చూసి తండ్రి తబ్బిబ్బు అయ్యారు. కుమారుడు కూడా వెంటనే తండ్రికి సెల్యూట్ చేశాడు.

## 12 వ రోజు కొనసాగిన ఎస్సై అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు.



కర్నూలు సెప్టెంబర్ 11 విభారె న్యూస్.ఎస్సై మెయిన్స్ పరీక్షకు ఈ రోజు 409 మంది ఎంపిక.పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ 2 వ బెటాలియన్ లో 12 వ రోజు దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి.ఈ దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ ఐపియస్, జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఐపియస్ పర్యవేక్షించారు. ఈ రోజు 800 మంది అభ్యర్థులకు గాను 579 మంది అభ్యర్థులు హజరయ్యారు.వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు,ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు.అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లు 1600 మీటర్ల పరుగు,100 మీటర్ల పరుగు,లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు.1600 మీటర్ల పరుగు పరీక్షలో మంది 523 అభ్యర్థులు పాల్గొన్నారు.471 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.100 మీటర్ల పరుగు పరీక్షలో 471 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.308 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.లాంగ్ జంప్ లో 471 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.406 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.ఎస్సై మెయిన్స్ పరీక్షకు ఈ రోజు 409 మంది అర్హత సాధించారు.గమనిక ఈవెంట్స్ కు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ మార్కు లిస్ట్ లతో పాటు 3 సెట్స్ జిరాక్స్ కాపీలు (గెజిటెడ్ సంతకం తో)ఖచ్చితంగా తీసుకురావాలి.

## ఆళ్లగడ్డ పట్టణంలో బంద్ పాక్షికం



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 11విభారె న్యూస్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్, రిమాండ్ ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర టిడిపి సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ కు పిలుపునిచ్చింది. ఆదివారం రాత్రి రాష్ట్రంలో 144 సెక్షన్ తోపాటు పోలీస్ యాక్ట్ అమలులో ఉందని డిజిపి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దీంతో బంద్ లో పాల్గొంటారని టిడిపి నాయకులను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియను గృహ నిర్బంధంలో ఉంచారు. టిడిపి నాయకులను, జనసేన పార్టీ నాయకులను మరియు ఇతర రాజకీయ పార్టీ నాయకులను ముందస్తు చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకోవడం జరిగిందని డిఎస్పి వెంకటరామయ్య తెలిపారు. చేప చేపట్టిన బందుకు మద్దతుగా జనసేన, కాంగ్రెస్, సిపీ ఐ, సిపిఎం పార్టీలు మద్దతు ప్రకటించి న పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పట్టణంలో బంద్ ప్రభావం పాక్షికంగా నెలకొంది.

## ఈ నెల 16,17న రవాణా కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి.- సిఐటియు.

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 11 విభారె న్యూస్.ఈనెల 16 17న రవాణా కార్మికుల కర్నూల్ లో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి రాముడు, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్( సిఐటియు) నాయకులు బి రాజు ఎండి యూసుఫ్ పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో సరస్సు జయప్రదం చేయాలని ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి రవాణా రంగ వాహనాలపై అనేక అపరాధ రుచులు వసూలు చేస్తున్నారన్నారు. జీవో నెంబర్ 27 ద్వారా పెనాల్టీలు మోయలేని భారాలవు తున్నాయన్నారు.పెట్రోల్ డీజిల్ ధరలు జిఎస్టి వల్ల రవాణా కార్మికుల వాహనాలు అమ్ముకొని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా రంగ కార్మికులకు తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.50 సంవత్సరాలు దాటిన డ్రైవర్లకు నెలకు 6000 పెన్షన్ ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు.పై అన్ని డిమాండ్ల




సాధన కోసం 16,17వ కర్నూల్ పట్టణంలోని ఎస్ టి బి సి కాలేజీ గ్రౌండ్ నందు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సుకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆటో మినీ లారీ జీప్ కార్మికులు బి. కృష్ణ, ఎస్. షబ్బీర్, ఎం.డి. మోహన్ దాస్, మోహన్, రామాంజి, సత్తార్ భాష, దాదా భాష, మహమ్మద్, శేఖర్, పి. రాజు,ఈరన్న గౌడ్, భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190